తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
24 జూన్ 2026
పేజీలు : 8
Follow :

## భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి:ఎస్ ఐ వెంకటేష్

పెనుబల్లి, జూన్ 23(జనం సాక్షి )



యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తి గత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వి ఎం బంజర్ ఎస్ ఐ కె వెంకటేష్ అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు మంగళవారం వీఎం బంజర్ పోలీసుల ఆధ్వర్యంలో కుప్పెనకుంట్ల టి జి ఎస్ డబ్ల్యు ఆర్ ఎస్, జె సి లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో ఎస్ ఐ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్ర మత్తం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, ప్రజలకు కూడా విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

## భరోసా కేంద్రాల సేవలను బలోపేతం చేయాలి

### ఎస్పీ శరత్ చంద్ర పవార్




నల్లగొండ ప్రతినిధి, జూన్ 23,(జనం సాక్షి): మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపులు, లైంగిక దాడుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని భరోసా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు ఒకే వేదికపై వైద్య, న్యాయ, మానసిక, పునరావాస సేవలు అందించడమే భరోసా కేంద్రాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, స్టేట్‌మెంట్ నమోదు, పరిహారం, పునరావాస సేవలు ఆలస్యం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో 2021 నుంచి 2026 వరకు భరోసా కేంద్రం పరిధిలో పోక్సో, అత్యాచారం, మహిళలు, చిన్నారులపై జరిగిన నేరాలకు సంబంధించిన మొత్తం 806 కేసులు నమోదయ్యాయని ఎస్పీ వెల్లడించారు. వీటిలో 16 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయని, బాధితులకు రూ. 1.68 కోట్లకు పైగా పరిహారం అందించినట్లు తెలిపారు.పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా పోలీసులు, ప్రాసిక్యూషన్, వైద్య శాఖ, ఫోరెన్సిక్ నిపుణులు, భరోసా కేంద్రం సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని సూచించారు. సాంకేతిక ఆధారాలు, వైద్య నివేదికలు, బాధితుల వాంగ్మూలాలు కేసుల విచారణలో కీలకమని, వాటిని నాణ్యతతో కోర్టులకు సమర్పించాలని పేర్కొన్నారు.బాల్య వివాహాల నివారణకు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించిన ఎస్పీ, విద్యార్థులకు పోక్సో చట్టం, బాలల హక్కులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేసే వాతావరణం కల్పించాలని, ప్రభుత్వం అందించే పరిహార పథకాలపై కూడా అవగాహన పెంచాలని తెలిపారు.సమావేశంలో పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి విశ్వనాథ్ కులకర్ణి, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సాయి మేఘనా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంజిత్ కుమార్, విమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా ఇన్‌చార్జ్ ఎస్ఐ అమీన్, కోఆర్డినేటర్ నళిన తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భరోసా కేంద్రం పనితీరు, కేసుల పురోగతి, పరిహారం పంపిణీ, పునరావాస కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

### బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

కల్లూరు జూన్ 23(జనం సాక్షి)




యువత చెడు వ్యవస్థలకు మత్తు పదార్థాలకు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి భవిష్యత్తుని బంగారు బాటకు వైపు పయనించే విధంగా నడుచుకోవాలని కల్లూరు ఎస్సై డి హరిత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తుకి భవిష్యత్తు కోల్పోయినట్లేనని దాంతోపాటు కుటుంబం కూడా దెబ్బతింటుందని మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలు గురించి వివరించారు. క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అవరోధించవచ్చునని బావి జీవితం మొత్తం బంగారు బాటగా ఉంటుందని దాని దృష్టిలో పెట్టుకొని చదువు పట్ల శ్రద్ధ పెట్టి చదువుకోవాలని కోరారు. ప్రధాన రహదారుల వెంట నడిచేటప్పుడు రోడ్లు భద్రత పాటించాలని తెలియని వ్యక్తులు ఏమైనా తిరుపదార్థాలు ఇచ్చిన తీసుకోవద్దని దానివల్ల అందులో ఏమైనా మత్తు పదార్థాలు ఉంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని అందుకే ఎవరు తీసుకోవద్దని కోరారు. మత్తుకు బానిసై మారకపోతే చట్టపరంగా చర్య తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలో సంక్షేమం - కాంగ్రెస్ పాలనలో మోసమే: హరీష్ రావు

అశ్వరావుపేట, జూన్ 23 (జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, ప్రజలు కేసీఆర్ మళ్లీ అధి కారం లోకి రావాలని ఎదురుచూస్తున్నా రని అన్నారు. కేసీఆర్ హయాంలో కళ్యాణలక్ష్మి, రైతుబంధు, బాలింతల సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలయ్యాయని, కరోనా సమయంలో కూడా ఏ పథకాన్ని నిలిపివేయలేదని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు బకాయిలు చెల్లించకపోవడం, పంట బీమా అమలు చేయకపోవడం, యూరియా కొరత సమస్యలను పరిష్క రించకపోవడం రైతాంగానికి అన్యాయం చేస్తున్న చర్యలని విమర్శించారు.సీతారామ ప్రాజెక్టు, సుంకిశాల, పెద్దవాగు వంటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నష్టం జరిగిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించినప్పటికీ నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా చేసిందేమీ లేదని, ప్రజల సమస్యలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కీముల ప్రభుత్వం కాదని, స్కాముల ప్రభుత్వమని వ్యాఖ్యానించారు.



రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలే రేపటి నాయకులని హరీష్ రావు అన్నారు.

## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.1.60లక్షల కుటుంబ భరోసా ఆర్థికసాయం.

బూర్గంపహాడ్ జూన్ 23 (జనంసాక్షి)



బూర్గంపహాడ్ కు చెందిన ఫోటోగ్రాఫర్ భజన మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబసభ్యులకు బూర్గంపహాడ్ మండల ఫోటోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి బాలకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ల సహకారంతో మంగళవారం ఫోటోగ్రాఫర్ కుటుంబసభ్యులకు రూ. 1.60లక్షల కుటుంబ భరోసా ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫోటోగ్రాఫర్లు ఒక సంఘంగా ఏర్పడి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.హుస్సేన్ సారధ్యంలో ఈ పథకాన్ని ఆవిష్కరించుకున్నారని, 20వేల సభ్యులతో కొనసాగుతున్న ఈ సంఘంలో ప్రతి ఫోటోగ్రాఫర్ రూ. 10 చొప్పున సంఘం ఖాతాలో జమచేయాలని...అప్పుడు రూ. 1.70 లక్షలు సంఘం ఖాతాలో జమ అవుతాయని వీటిని ఎవరైనా సభ్యుడు మరణిస్తే రూ. 1.60లక్షలు చొప్పున బాధిత కుటుంబానికి అందజేయడం జరుగుతుందని, రూ. 10వేలు వైద్యఖర్చులకు అందిస్తామని తెలిపారు. ఈ నగదుతో ఓ ఫోటోగ్రాఫర్ కుటుంబానికి కుటుంబ భరోసా కల్పించినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ మండల కార్యదర్శి ఆవుల వెంకటరమణారెడ్డి, కోశాధికారి మేడి శేషగిరి, జిల్లా అధ్యక్షులు కేసర సుధాకర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ పంపన రమేష్, ఉపాధ్యక్షులు మూర్తి, విజయ్, మండల ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



## కోలాహలంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు

**కల్లూరుజూన్ 23(జనం సాక్షి)**

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఖాన్ ఖాన్ పేట గ్రామంలోమూడో వార్డు కౌన్సిలర్ దాసరి సుధారాణి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు కోలాహలంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు ,కల్లూరు మండల అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు , పట్టణ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, భాగం ప్రభాకర్ తదితరులు పాల్గొని ఇందిరమ్మ ఇళ్ల ను ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలనే సాగు చేయండి

**- వ్యవసాయ శాఖాధికారి నవీన్ కుమార్..**

**- భద్రాచలం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా..**

**భద్రాచలం జూన్ 23 (జనంసాక్షి)**

రైతులు ఎలినో ప్రభావం వలన ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖాధికారి నవీన్‌కుమార్ అన్నారు. భద్రాచలంలోని రైతు వేదికలో మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు విత్తన మేళా నిర్వహించ నుండగా మేళాను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, పప్పు ధాన్యాలు, ఆధునిక ఎరువుల వినియోగంపై అవగహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ వారం రోజుల పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు పలు రకాల విత్తనాలను విక్రయించడం జరుగుతుందన్నారు. మండల రైతులు సన్న వడ్లు, పప్పుదినుసులు, నూనె గింజలు, కూరగాయలను ఎక్కువగా పండించాలని తెలిపారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీని ఉపయోగించాలని కోరారు. యూరియాను యాప్ ద్వార బుక్ చేసుకొని కొనుగోలు చేయాలన్నారు. అలాగే ఎలినో ప్రభావం వలన ఆరుతడి పంటలను మాత్రమే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 19 షాపుల డీలర్లు పాల్గొన్నారు.

## జిల్లా అటవీ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన గొడిశాల రామనాథం

**పినపాక, జూన్ 23 (జనంసాక్షి):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ అధికారి జి. కృష్ణ ఐ ఎఫ్ ఎస్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, పినపాక మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం పోడు భూముల సమస్యపై కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. కృష్ణ కి శుభాకాంక్షలు తెలియజేసి, శాఖ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రామనాథం పేర్కొన్నారు.



## రైతు వేదికలో విత్తనమేల కార్యక్రమం

**నేరేడుచర్ల (జనంసాక్షి)**

మండలంలో దిర్శించర్ల రైతు వేదిక నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహించ బడుతున్న రైతు వేదికలలో విత్తనమేల అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జావేద్ రైతులకు పంట మార్పిడి,సన్న వడ్ల రకాల సాగు నీ ప్రోత్సహించడం,వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు వాటి యొక్క ప్రోత్సహకాలు,కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ రకాల పథకాల గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి,మాజీ చైర్మన్ ప్రకాష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ళ సురేష్ రెడ్డి, డైరెక్టర్లు, గ్రామ సర్పంచి, బుర్రి శ్రీనివాస్,రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు హిమబిందు,త్రివేణి, విత్తన కంపెనీ డీలర్లు,ఫర్టిలైజర్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్టును పునరుద్ధరించాలి

**భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్**

**ఎమ్మెల్యే డా. తెల్లం వెంకటరావు కు వినతిపత్రం అందజేత**



**భద్రాచలం జూన్ 23 (జనంసాక్షి)**

భద్రాచలం మొబైల్ కోర్టును రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఆర్.టి. నంబర్ 70ని వెంటనే ఉపసంహరించుకోవాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు భద్రాచలం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కి బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అలాగే, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి, రెవెన్యూ శాఖ మంత్రి కి కూడా విన్నవించాలని వారు నిర్ణయించినట్లు తెలిపారు. దీనితో పాటు, 2019 తర్వాత ఎన్రోల్ అయిన న్యాయవాదులందరికీ ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులను ఇష్యూ చేయాలని బార్ అసోసియేషన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, సంయుక్త కార్యదర్శి తాత లలిత, మాజీ అధ్యక్షులు కోట దేవదానం, సీనియర్ న్యాయవాదులు గోడపర్తి నాగరాజు, రావి రామ్మోహన్, అవులూరి సత్యనారాయణ, కె. అరుణ, నర్మదా, పడిసిరి శ్రీనివాసరావు, ఎం.వి. రమణ, విజ్జగిరి రవితేజ, కొత్తపల్లి రాంబాబు గాయత్రి, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



## చండూరులో ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం

**చండూరు జూన్ 23 (జనంసాక్షి)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం చండూరు మండలంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంత మైంది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ బంద్‌కు మద్దతుగా మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు, దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే విద్యాశాఖలో కీలకమైన ఎం ఈ ఓ, డీఈవో పోస్టులను కూడా భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి..మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యాంగాన్ని అరికట్టాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫార్మ్, బెల్టులు అమ్ముకుంటూ వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనుమతులు లేని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పెండ్యాల సాయి, సంపత్, శివ, వంశీ, ఉదయ్, గణేష్, విగ్నేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన జి.సి.డి.వో

**ఎర్రుపాలెం, జూన్ 23 (జనంసాక్షి):**

ఎర్రుపాలెం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను జి సి డి ఓ పి రూబీ పంకజం మంగళవారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు పాఠశాల ఎస్ ఓ కే సరిత ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో శానిటేషన్ పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులపై అప్రమత్తం గా ఉండాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సరిత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉచిత ఉపాధిపై శిక్షణ..

**భద్రాచలం జూన్ 23 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైటీసీ శిక్షణా కేంద్రంలో 18 నుండి 33 సంవత్సరాల వయస్సు గల ఎస్టీ యువతీ, యువకులకు మాత్రమే ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కంప్యూటర్ కోర్సు - 1 బ్యాచ్, బ్యూటీషియన్ కోర్సు - 2 బ్యాచ్ లు మాత్రమే సీట్లు మిగిలి ఉన్నాయని ఉచిత భోజనం వసతి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయనన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు వచ్చేనెల జూలై 06వ తేదీ లోగా తమ లగేజ్ తో నేరుగా శిక్షణా కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 7993102529 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి.: డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి



భద్రాచలం జూన్ 23 (జనంసాక్షి)

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రతిపక్షాల విమర్శలు తిప్పి కొట్టాలంటే శిక్షణ తరగతుల ద్వారా మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కేడర్ను సమాయత్తం చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి శ్రీమతి మీనాక్షి నటరాజన్ కు అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుండి బిజెపి కుట్ర పూరిత రాజకీయాల వల్ల రాజ్యసభ సభ్యత్వాన్ని కోల్పోయిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ను అంతర్జాతీయ గాంధీపథం అధ్యక్షులు డా.భూశిరెడ్డి శంకర్ రెడ్డి కలిసి విచారం వ్యక్తం చేశారు. బిజెపి కుట్రపూరిత రాజకీయాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని మట్టుపెట్టి రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని డా.భూసిరెడ్డి శంకర్ రెడ్డి ఉద్ఘాటించారు. రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిగా చూడటం కోసం రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ పథం కార్యాచరణ రూపొందించి పనిచేస్తుందని, ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ కు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కొత్తగూడెం గాంధీ పదం కన్వీనర్ చింతలచెరువు గిరీశం తో పాటు పాల్గొన్నారు.



# నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న పోలీసులు

**యాదాద్రి జిల్లా ,తుర్కపల్లి జూన్ 23, (జనం సాక్షి)**

తుర్కపల్లి మండల కేంద్రంలో విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి పోలీసులు ,వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి బస్టాండ్ ముందర దొండపాటి మల్లికార్జునరావు అను వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతను గుంటూరు నుండి సిద్దిపేటకు నిషేధిత బిజీ శ్రీశ్రీ పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా గుర్తించారు. మొత్తం ఐదు సంచుల్లో విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు సంచుల్లో 70 కిలోలు, విడిగా ఉన్న సంచుల్లో 80 కిలోల నకిలీ పత్తి విత్తనాలు కలిగి ఉన్నవి. సుమారుగా 10 లక్షల విలువ గల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపారు.స్వాధీనం చేసిన విత్తనాలు నిల్వ రవాణా విక్రయాలకు సంబంధించి నిందితుడు ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్, బిల్లులు, ఇన్వాయిస్ ,రవాణా అనుమతులు స్టాక్ రిజిస్టర్లు అధికార పత్రాలను సమర్పించలేదన్నారు. పోలీసుల విచారణలో గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం కేసనపల్లి గ్రామనికి చెందిన దొండపాటి మల్లికార్జునరావు వయసు 36 సంవత్సరాలు తండ్రి వెంకటేశ్వర రావు, ఎ 2 గా చిత్తూరు జిల్లాకు చెందిన శంకర్ తో కలిసి తెలంగాణ రాష్ట్రం లో అక్రమంగా బిజీ శ్రీశ్రీ పత్తి విత్తనాలను తరలిస్తున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతానికి శంకర్ పరారీలో ఉన్నాడు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరిండెంట్ అక్షాంష్ యాదవ్, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ ,యాదాద్రి డివిజన్ ఎస్డిపిఓ శ్రీనివాస్ నాయుడు ,ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తుర్కపల్లి ఎస్సై తఖీయుద్దీన్ ,మండల వ్యవసాయ అధికారి ఉమా ,పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీని నిర్వహించారు.




# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**అనంతగిరి(జనంసాక్షి):**

అనంతగిరి మండలం పాలారం ఆవాస గ్రామం రంగయ్యగూడెం ప్రాథమిక పాఠశాలలో ఆశాజ్యోతి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వారు ఎన్నారై వెలిగేటి కరుణాకర్,సుధాకర్,వంశీ, నందగోపాల్ సహకారంతో ఆ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామినేని సతీష్ మాట్లాడుతూ ఈ దాతృతపు వెలుగు విద్యార్థుల జీవితాల్లో కొత్త ఆశలకు నాంది పలుకుతుందని అన్నారు.విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపతి ఉపేందర్, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలన

**నూతనకల్ జూన్ 23 (జనంసాక్షి)**

మండల పరిధిలోని అలుగునూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ కాసా నరేందర్ యాదవ్ వారి బృందంతో మంగళవారం గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు పిల్లలతో మాట్లాడి వారితో మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు కొన్ని సలహాలు సూచనలు ఇచ్చారు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్య, ఉపసర్పంచ్ గోరంట్ల వెంకన్న వార్డ్ మెంబర్లు పోడేటి సతీష్ పట్టేటి కొండల్ పట్టేటి బిక్షం గ్రామపంచాయతీ సిబ్బంది సంజీవ పాల్గొన్నారు.



# అదుపు తప్పిన ట్రాక్టర్..!

## 25 మంది కూలీలతో వెళుతున్న ట్రాక్టర్,5 గురు కూలీలకు తీవ్ర గాయాలు?

**పి.ఏ.పల్లి,జూన్ 23(జనంసాక్షి)**

పి.ఏ.పల్లి మండలం పెద్దగట్టు గ్రామ పరిధిలో కూలీలను తరలించే ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాక్టర్ ట్రాలీ చింతకాయ ఉడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న కూలీలు ట్రాలీ నుండి ఒక్కసారిగా కింద పడిపోవడంతో కొంతమంది కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి.గాయపడిన కూలీలను తోటి కూలీలు సాగర్ కమలానెహ్రు ఆసుపత్రికి తరలించారు.కూలీలంతా బాణాలకుంట గ్రామానికి చెందినవారు.పత్తి గింజలు పెట్టడానికి రోజూ వారి కూలీ పని నిమిత్తం బూడిదగట్టు గ్రామంలో పని ముగించుకొని వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో కూలీలంతా ఒక్కసారిగా ఉలికిపడ్డారు.సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# యాంటీ డ్రగ్స్ పై ప్రజలకు అవగాహన

- యువకులు మారకద్రవ్యాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి
- తుంగతుర్తి సీఐ కె ఉపేందర్ రావు




**నూతనకల్ జూన్23(జనంసాక్షి)**

నూతనకల్ మండల కేంద్రం లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు మంగళవారం ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తులు, కుటుంబాలు మరియు విద్యార్థులపై కలిగే దుష్ప్రభావాల గురించి తుంగతుర్తి సీఐ కే ఉపేందర్ రావు అవగాహన కల్పించారు యువత అధికంగా మాదకద్రవ్యాలు వాడుతున్నందున తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని, మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్య, సామాజిక మరియు ఆర్థిక పరమైన నష్టాలు సంభవిస్తాయని వివరించి, వాటికి దూరంగా ఉండాలని వారు సూచించారు అలాగే తమ పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని వారు ప్రజలకు సూచించారు ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు స్టేషన్ సిబ్బంది మండల ప్రజలు పాల్గొన్నారు.

# పి.ఏ.పల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడుగా నెర్మటి సత్యనారాయణ రెడ్డి

- వినయ,విధేయతకు "పట్టం" కట్టిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం
- బాలు నాయక్ కు ధన్యవాదములు తెలిపిన నూతన అధ్యక్షులు నెర్మటి

**పి.ఏ.పల్లి,జూన్ 23 (జనంసాక్షి ):**



పి.ఏ.పల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గా అంగడిపేట గ్రామానికి చెందిన నెర్మటి సత్యనారాయణ రెడ్డి ని దేవరకొండ నియోజకవర్గం శాసన సభ్యులు బాలు నాయక్ సూచనల మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానం,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.ఏ.పల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రయత్నిస్తానని ఆయన అన్నారు.తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, దేవరకొండ శాసన సభ్యులు బాలు నాయక్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టుల ఎదురుచూపులు

## తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్ బాబా

**భువనగిరి, జూన్ 23 (జనం సాక్షి)**

యాదాద్రి భువనగిరి జిల్లాలో వివిధ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు మహమ్మద్ షానూర్ బాబా డిమాండ్ చేశారు.

మంగళవారం భువనగిరి పట్టణంలోని వందన కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ జర్నలిస్టుల గృహ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల్లో అధిక శాతం మంది ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇండ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి



అర్హులైన వారికి పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి, సొంత ఇంటి కలను సాకారం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో టీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శులు నాగరాజు, కదిర్, భువనగిరి మండల కార్యదర్శి అల్తాఫ్, గుండాల మండల అధ్యక్షుడు నరేష్, మోత్కూర్ మండల అధ్యక్షుడు నర్సింహా, అడ్డగూడూర్ మండల అధ్యక్షుడు సందీప్, తుర్కపల్లి మండల కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాటి కెసిఆర్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసింది

✧నేటి రేవంత్ ప్రభుత్వం రైతుల్ని దగా చేస్తుంది ✧ బిఆర్ఎస్ పార్టీసీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్



**మునగాల, జూన్ 23 (జనంసాక్షి):** తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం, అధికారం చేపట్టి నేటికీ 30 నెలలు కావస్తున్న ఎన్నికలకుముందు రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతుల్ని దగా చేస్తూ పరిపాలన సాగిస్తుందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంనందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు రైతుబంధు ఎకరానికి 15 వేల రూపాయలు, ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల పూర్తిస్థాయి రుణమాఫీ, వరిపంటతోపాటు రైతు పండించిన అన్ని రకాల పంటలకు 500 రూపాయల బోనస్ వంటి హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ రైతులకు ఎక్కడ పూర్తిస్థాయిలో 100% రెండు లక్షల రూపాయల రుణమాఫీ జరగలేదని, ఎకరానికి 15 వేల రూపాయల రైతు భరోసా ఇస్తానన్న రేవంత్ రెడ్డి, ఇప్పటి వరకు రెండుసార్లు మాత్రమేఎకరానికి 6000 రూపాయల చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేశారని, అది కూడా ఎకరం రెండు ఎకరాలు ఉన్న సన్న చిన్న కారు రైతులకు మాత్రమే అందిస్తూ చేతులు దులుపుకున్నారన్నారు. వరి పంటతో పాటు అన్ని రకాల వ్యవసాయ పంటలకు బస్తాకు 500 రూపాయల బోనస్ ఇస్తానని ప్రకటించిన ప్రభుత్వం, కనీసం వరి పంటకు కూడా 5 వందల రూపాయల బోనస్ చెల్లించలేకపోయింది అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం రైతులందరికీ ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమాతో రాష్ట్ర రైతాంగానికి ధీమా కల్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బీమా ప్రీమియం చెల్లించకుండా రాష్ట్ర రైతాంగానికి తీరని ద్రోహం చేసిందన్నారు. ధరణిని బంగాళాఖాతంలో ఏస్తాను అని ప్రగల్బాలు పలికిన రేవంత్... ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి ద్వారా రైతులకు ఏం న్యాయం చేశాడో చెప్పాలని సవాల్ చేశారు. నేటికీ రెవెన్యూ కార్యాలయాలలో పెండింగ్లో ఉన్న సాదా బైనమాలకు పరిష్కారం చూపలేదని, లక్షలాది దరఖాస్తులు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. కెసిఆర్ ప్రభుత్వం 29 రకాల సన్న రకం ధాన్యానికి అనుమతి ఇచ్చి కనీస మద్దతు ధర చెల్లిస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని7 రకాలకు కుదిస్తూ తాము చెప్పిన ఏడు రకాల ధాన్యాన్ని తప్ప ఇతర ధాన్యాన్ని రైతులు పండిస్తే కొనుగోలు చేయమని రాష్ట్ర రైతాంగం పై హుకుం జారీ చేసి బెదిరించడం చూస్తుంటే ఈ ప్రభుత్వం ఎంతటి దిగజారుడు చర్యలకు పూనుకుంటుందో అర్థమవుతుందన్నారు. రైతులకు పంపిణీ చేసే యూరియా విషయంలో ప్రత్యేక యాప్ వ్యవస్థ తీసుకొచ్చి ఎకరానికి రెండు యూరియా కట్టలే ఇస్తామంటూ పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు రోడ్లపై తిప్పుతుందన్నారు, రైతులు వ్యవసాయ సేద్యం కోసం వాడే ఎరువులు విత్తనాలు పురుగుమందుల రేట్లను భారీ స్థాయిలో పెంచి సేద్యం చేయడానికి రైతు అప్పులు చేసే పరిస్థితి తీసుకొచ్చింది అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి ద్వారానే నేటికీ రైతు భరోసా నిధులు విడుదలవుతున్నాయని, భూభారతి పోర్టల్ ద్వారా రాష్ట్రంలో రైతుల ఎదుర్కొంటున్న భూసమస్యలకు ఎక్కడ పరిష్కార మార్గం చూపించిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ విద్యుత్ కలెక్షన్లు ఉన్నాయని, రైతుల విద్యుత్ కలెక్షన్లకు మీటర్లు పెట్టిద లేదని నాటి కెసిఆర్ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడితే, నేటి ప్రభుత్వం రైతు డిస్కంల ఎత్తివేత ఆలోచన చేస్తూ రైతుల వ్యవసాయ విద్యుత్ కలెక్షన్లకు మీటర్లు పెట్టే ఆలోచన చేస్తుందని అన్నారు. కెసిఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది ఎకరాలకు సాగునీళ్ళు, ప్రజలకు తాగునీరు అందిస్తే ఈ ప్రభుత్వం కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని ప్రచారం చేస్తూ నీటిని ఎత్తిపోయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఎడారిగా మార్చే చర్యకు పూనుకుంటుందని, తక్షణమే ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఎత్తిపోసి ఎస్సారెస్పీ కాలువల ద్వారా సూర్యాపేట జిల్లాకు సాగునీళ్లు తాగునీళ్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునర్ ఆలోచన చేసి రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకునేందుకు రైతుబంధు, రైతు బీమా, 500 బోనస్, భూభారతి, యూరియా యాప్, తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని లేనియెడల కేసీఆర్ సారథ్యంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రైతాంగానికి అండగా ఉండి పోరాటానికి సిద్ధమవుతామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, మునగాల పిఎసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, తాడ్వాయి మాజీ పీఏసీఎస్ చైర్మన్ తొగరు సీతారాములు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, ఇంద్రశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి

# నేతాపురం సర్పంచ్ వినూత్న నిర్ణయం

**ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత ఆటో ప్రయాణం**

**విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటి పన్ను మాఫీ**



**తిరుమలగిరి (సాగర్) జూన్ 23 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయంగా నేతాపురం గ్రామ సర్పంచ్ బాసిరెడ్డి శ్రీనివాసరెడ్డి వినూత్న నిర్ణయం తీసుకున్నారు. దానిలో భాగంగానేతాపురం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఉచిత ఆటో సౌకర్యం కల్పిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు రాకపోకలు సాగించేలా ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటి పన్ను మినహాయింపు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచడం, విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.గ్రామంలోని ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను అభ్యసించేలా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి తమ పిల్లలను చేర్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల గ్రామ ప్రజలు, మండలంలోని ప్రజలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు .అన్ని గ్రామాలలో గ్రామ సర్పంచులు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని ,విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని వారు అన్నారు.

# ప్రారంభమైన అమ్మవారి బ్రహ్మోత్సవాలు..

**కనగల్లు, జూన్ 23 (జనం సాక్షి)** ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారుజామునే మంగళ వాయిద్యములతో సుప్రభాత సేవ లలిత సహస్రనామార్చన బాల భోగ నివేదన జాతర ప్రారంభంతో ధ్వజారోహణం దేవి మలమూత్రహోమములు మండపం పూజలు మహానివేదన గవంత పూజలు వాస్తు పూజలు విగ్నేశ్వర పూజలు పంచగవ్య రక్షకబంధనం అఖండ దీపారాధన తీర్థ ప్రసాద గోష్టి చండీ హోమం నవగ్రహ హోమం బలిహరణ పుట్ట బంగారం దేవి మలమూత్ర హోమం యాగశాల మండపం నీరజనం మంత్రపుష్పములు ఎదుర్కోళ్ళ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వేదమంతోత్సవాలతో మహా వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహన అధికారి అంబటి నాగిరెడ్డి, ధర్మకర్తలు కే శంకర్ రెడ్డి ఎం గణేష్ మోహన్ కే పరమేష్ ఎన్ యాదగిరి ఎం మహేష్ జి సైదులు పి.సత్యనారాయణ కే శ్రీను ఎం రమణ ఎన్ వెంకన్న ఎన్ తిరుపతయ్య ఎన్ వెంకటేశ్వర్లు సిహెచ్ రమేష్ మాజీ చైర్మన్ గోపాల్ రెడ్డి ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, సిహెచ్ శ్రవణ్ కుమార చార్యులు, గాదే దామోదర్ రావు, ప్రవీణ్ కుమార్ ఆచార్యులు, ఉమామహేశ్వర్, సిబ్బంది నాగేశ్వరరావు ఉపేందర్ రెడ్డి, రాజయ్య, జై నాగరాజు, ఆంజనేయులు వెంకటయ్య, శ్రీకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.





# హక్కుల కొరకు పోరాడి సాధించాలని పిలుపు

## ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్



**బూర్గంపహాడ్ జూన్ 23 (జనంసాక్షి)** సంఘటితంగా హక్కుల కొరకు పోరాడి, సాధించండని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ మహాసభలో ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్. పిలుపునిచ్చారు. తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రాజెక్టు మహాసభ బూర్గంపహాడ్ మండలం సారపాక ఏఐటీయూసీ ఆఫీస్ కపర్తి భవనంలో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ఏ ఐ టి యు సి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాటి ప్రసాద్ హాజరై వారు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లకు కనీస వేతనం రూ. 18000 ఇవ్వాలని, అంగన్వాడీ టీచర్లను బిఎల్ఓ డ్యూటీ నుంచి మినహాయించాలి, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోరాటానికి పిలుపునిచ్చారు. గతంలో ఏఐటియుసి పోరాటాల ఫలితంగానే కొన్ని సాధించామని ఇంకా సాధించవలసినవి చాలా సమస్యలు ఉన్నా యని వాటి పరిష్కారం కొరకు అందరూ ఐక్యమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా బూర్గంపహాడ్ ప్రాజెక్ట నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులుగా జీవి రమణ, సలహాదారు లుగా పేరాల శ్రీనివాసరావు, అధ్యక్షులుగా కొరం శ్రీలత, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి, మంగ, ప్రధాన కార్యదర్శిగా భూక్య రచన, సహాయ కార్యదర్శిగా విజయ, సరోజిని, జ్యోతి, కోశాధికారిగా సరోజ, కార్యవర్గ సభ్యులుగా కొమరం లత, కదారి రమాదేవి, భాగ్యమ్మ, నాగవేణి లను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీజిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ, శ్రీదేవి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.



# ఎబివిపి పాఠశాలల బంద్ విజయవంతం

**నేరేడుచర్ల (జనంసాక్షి) ..** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేరేడుచర్ల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట రాష్ట్రంలో 24 వేల పాఠశాలను మూసి వేతను నిరసిస్తూ ఎబివిపి రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ లో భాగంగా బంద్ విజయవంతం కావటం జరిగిందని ఎబివిపి నాయకులు కొప్పు లోకేశ్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలో అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మరియు విద్యార్థులను తీవ్ర మనోవేదన గురిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలో 23 వేల పాఠశాలలను మూసివేసే కుట్రను తక్షణ ఉపసంహరించుకోవాలి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఖాళీగా ఉన్న ఎంఈఓ డీఈవో పోస్టులను, టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టల్ వెంటనే భర్తీ చేయాలి గురుకులాల పాఠశాలకు పక్కా భవనాలు నిర్మించాలని యన్.పి.ఈ 2020 వెంటనే అమలు చేయాలని ప్రవేటు కార్పొరేట్ పాఠశాలలో 25% సీట్లను పేద విద్యార్థుల కేటాయించాలని మరియు విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోవు రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎబివిపి భారీ ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎబివిపి శ్రీను పండు, మన్నెం గౌతమ్ , అవినాష్, తదితరులు పాల్గొన్నారు.



## విత్తన మేళ సద్వినిగం చేసుకోవాలి

**వలిగొండ, జున్ 23 (జనం సాక్షి )**

వలిగొండ , ప్రొద్దటూరు రైతువేదికలలో వ్యవసాయ శాఖ వలిగొండ వారి ఆధ్వర్యంలో జూన్23 నుండి జూన్ 30 వరకు విత్తన మేళా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అంజలీదేవి తెలిపారు. విత్తన మేళాలో వరి, కంది ,వివిధ రకాల పంటల విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని కావున మండల పరిధిలోని రైతులు విత్తన మేళాను సందర్శించి వారికి అనువుగా ఉన్నటువంటి విత్తనాలను ఎంపిక చేసుకొని సాగు చేపట్టవలసినదిగా సూచించడం జరిగింది. ప్రభుత్వం సూచించిన 8 సన్న వరి రకాలను మాత్రమే సాగుచేసి క్వింటాకు రూ.500/- బోనస్ పొందగలరని వ్యవసాయ శాఖ వారు సూచించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వలన ఈ వానాకాలం వర్ష సూచన తక్కువ ఉన్నందున రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన పప్పు దినుసులు , అపరాల సాగు చేపట్టవలసిందిగా సూచించడం జరిగింది.

## కార్మికుడికి ఆర్థిక సహాయం



**వలిగొండ, జున్ 23( జనంసాక్షి)**

వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు పోలేపాక రాములు ఇటీవల కాలు విరిగింది. దీంతో రాములు కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురికాగా కాంగ్రెస్ నాయకుడు రవీంద్ర రాములుకు 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు, రాష్ట్ర నాయకుడు కాసుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా డ్రైనేజీ కాలువ పనులు

### పీఎం శ్రీ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఎంపీడీవో

**నూతనకల్ జూన్ 23 (జనంసాక్షి)**

మండల కేంద్రంలోని 280 మీటర్ల డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి మంగళవారం ఎంపీడీవో సునీత కాలువ పనులను ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు నూతనకల్ అంబేద్కర్ చౌరస్తా నుండి లింగంపల్లి వెళ్లే రోడ్డు లో సీసీ రోడ్డు వేయడం ద్వారా మెయిన్ రోడ్డు నుండి వర్షపు డ్రైనేజీ మురుగునీరు అధికంగా వచ్చే సూచన ఉన్నందున పంచాయతీ నిధులతో కాలువ నిర్మాణం చేస్తున్నామని సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ అన్నారు హైస్కూల్లో మట్టితో చదును చేస్తున్న కార్యక్రమాన్ని ఎంపీడీవో సునీత పరిశీలించారు ఆమె ఈ అభివృద్ధి కార్యక్రమాలను చూసి గ్రామ సర్పంచ్, కార్యదర్శి,సిబ్బందిని అభినందించారు.



## జాతీయ అహింస ధ్యాన మహాసభలను విజయవంతం చేయాలి



**సూర్యాపేట(జనంసాక్షి):** అక్టోబర్ 1 నుండి 5వ తేదీ వరకు హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే జాతీయ అహింస ధ్యాన మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో శివసాయి పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య దివ్య శ్రీనివాస్ మాట్లాడుతూ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్, వెజిటేరియన్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శాకాహారం, జీవకారుణ్యం, ధ్యానం పట్ల అవగాహన పెంచడానికి ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల విజయవంతం కోసం శాకాహార ధ్యాన ప్రచార రథాలతో మెగా శాకాహార ప్రచార ర్యాలీలు,యాత్రలు చేపట్టినట్లు తెలిపారు. శాఖాహారమే మానవాహారమని, దైవత్వానికి చేరువ చేసేది శాఖాహారం మాత్రమే అని అన్నారు. ధ్యానం సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని పేర్కొన్నారు. అహింసతోనే మానవ ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం శివసాయి పిరమిడ్ ధ్యాన మందిరంలో ప్రత్యేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ సాయి పిరమిడ్ ట్రస్ట్ ప్రెసిడెంట్ తోట నాగమణి, సెక్రటరీ జీ.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ చందా విశ్వం, మానుపురి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే భర్తరఫ్ చేయాలి

### డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య



**తుంగతుర్తి జూన్ 23 (జనం సాక్షి)** నీట్ పేపర్ నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే ప్రధాని మోడీ బర్తరఫ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని మాజీమంత్రి ఆర్డీఆర్ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని అన్నారు, రాహుల్ గాంధీ చేపట్టిన విద్యార్థుల గొంతుక చాత్రోంకి గుంజు కార్యక్రమానికి జిల్లా పార్టీ తరఫున మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దేశంలో ఉన్న ప్రతి వేయి మందిలో కేవలం 12 మందికే ఉద్యోగాలు వస్తున్నాయని, రెండు కోట్ల మందికి ఉద్యోగ అవకాశాలు లేకపోవుగా పేపర్ లీకేజ్ ల పేర్లతో విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని విమర్శించారు. పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీల వల్ల మా భవిష్యత్తు ఆగమవుతుందని స్నేహ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. దీంతో చలించిపోయిన రాహుల్ గాంధీ విద్యార్థుల పక్షాన విద్యార్థుల గొంతుకగా చేపట్టిన ఛాత్రోంకి గుజ్ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ రామడుగు నవీన్ చారి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కోరుకుప్పల నరేష్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, నాయకులు పెద్దబోయిన అజయ్ కుమార్, కుంచాల ప్రవీణ్ రెడ్డి, ఉప్పుల రాంబాబు, చింతకుంట్ల హరీష్, కొండ పరుశ, తొనుకునూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వినియోగం తగ్గించి నానో ఎరువులు వాడాలి

### మండల వ్యవసాయ అధికారి ఏ. శైలజా రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, జూన్ 23 (జనం సాక్షి):** యూరియా వినియోగం తగ్గించి నానో ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి ఏ. శైలజా రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జూలూరు గ్రామ రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వరి విత్తనాలతో పాటు వివిధ రకాల విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను మండల వ్యవసాయ అధికారి ఏ. శైలజా రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంటల సాగులో సాంప్రదాయ యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియాను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. నానో ఎరువుల వాడకం వల్ల ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు పంటల దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగ విధానం, వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జూలూరు గ్రామ సర్పంచ్ కాసుల అంజయ్య గౌడ్, జూలూరు పీఏసీఎస్ సీఈఓ నరసింహ, ఏఈఓ శివమూర్తి, రైతులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.




## మత్తు మహమ్మారికి దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్తు

### చాడ పాఠశాలలో పోలీసుల డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సు

**మోటకొండూరు,జూన్ 23(జనం సాక్షి):**

విద్యార్థి దశలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడితే వారి బంగారు భవిష్యత్తు పూర్తిగా నాశనమవుతుందని మోటకొండూరు ఎస్సై అశోక్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల, మార్గదర్శకాల మేరకు మంగళవారం మోటకొండూరు మండల పరిధిలోని చాడ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'డ్రగ్స్ అబ్యూజ్ – మారకద్రవ్యాల నిర్మూలన' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై అశోక్ మాట్లాడుతూ.. నేటి యువతే రేపటి పౌరులని, వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్/గంజాయి విక్రయిస్తున్నట్లు లేదా వాడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నివారణపై విద్యార్థుల్లో మరింత చైతన్యం తీసుకురావడానికి పాఠశాల ఆవరణలో మరియు నోటీస్ బోర్డులపై డ్రగ్స్ నివారణ పోస్టర్లను పోలీసు అధికారులు అంటించారు. ఈ చైతన్య కార్యక్రమంలో మోటకొండూరు ఎస్సై అశోక్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 7 సన్న రకాల వరి విత్తనాలకే బోనస్

### రైతు వేదికలలో విత్తన మేళా

### మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్

**నూతనకల్ జూన్ 23(జనంసాక్షి)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమం సందర్భంగా మండలంలోని మిర్యాల రైతు వేదిక, దిర్శన్నపల్లి రైతు వేదిక మరియు తాలసింగారం రైతు వేదికలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి పాల్గొని ప్రభుత్వం నిర్వహిస్తున్న విత్తనమేల కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగించుకోవాలని అన్నారు మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక విత్తనాల వినియోగం సాగు పద్ధతులు మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహనను రైతు వేదికలలో కల్పించబడుతుంది అలాగే ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు సన్న రకాల వరి ధాన్యాలను రైతులు సాగు చేసి, ప్రభుత్వం అందించే బోనస్ ప్రయోజనాలను పొందాలని సూచించారు అదేవిధంగా రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు మరియు అవసరమైన ఇతర ధ్రువపత్రాలను సంబంధిత డీలర్‌కు సమర్పించి విత్తనాలను కొనుగోలు చేయాలని తెలియజేశారు. ప్రజాప్రతినిధులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అందిస్తున్న ఈ అవకాశాలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని వారుకోరారు ఈ కార్యక్రమంలో సర్పంచులు జటంగి నాగలక్ష్మి గణేష్ యాదవ్, అనంతుల శ్రీనివాస్ గౌడ్, పాండవుల లింగయ్య ఏ ఈ ఓ లు పావని, సాయి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



# చెరువుపల్లిలో నోర్మటి శ్రీనివాస్ రెడ్డి ఉదారత్వం పాఠశాలకు బ్యాగులు, జీపీకి ఫర్నిచర్ బహుకరణ

### ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆర్థిక సాయం

### దాతల సేవా గుణాన్ని అభినందించిన గ్రామస్తులు, అధికారులు



**మాడుగులపల్లి, జూన్ 23 ( జనంసాక్షి):** మండల పరిధిలోని చెరువుపల్లి గ్రామంలో మంగళవారం ఝాన్సీ - శ్రీనివాస్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు గ్రామానికి చెందిన దివంగతులు పద్మమ్మ సత్తిరెడ్డిల పవిత్ర జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు నోర్మటి ఝాన్సీ - శ్రీనివాస్ రెడ్డిల ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమాలు చేపట్టారు.

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత బ్యాగులు, పుస్తకాలు**

స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి (ఎంఈఓ) వెంకటమ్మ హాజరై, దాత శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందజేశారు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దాతలు ఆకాంక్షించారు

**గ్రామ పంచాయతీకి ఫర్నిచర్ ఆలయానికి రంగులు**

పాఠశాల కార్యక్రమం అనంతరం, గ్రామ పంచా యతీ కార్యాలయం పరిపాలన సౌలభ్యం కోసం దాత శ్రీనివాస్ రెడ్డి రూ. 40,000 విలువైన ఫర్నిచర్‌ను బహుకరించారు అదేవిధంగా, గ్రామంలో జరుగుతున్న గంగదేవమ్మ జాతరను పురస్కరించుకుని, స్థానిక గంగదేవమ్మ ఆలయానికి రంగులు (కలర్స్), బొమ్మల తయారీ పనుల కోసం తన సొంత ఖర్చులతో మరో రూ. 40,000 ఆర్థిక సాయాన్ని అందించారు గ్రామాభివృద్ధి కి, విద్యకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఒకేసారి ఇంతటి ఉదార సాయం అందించి నందుకు గ్రామస్తులంతా దాత నోర్మటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి ప్రత్యేక కృత జ్ఞతలు తెలుపుతూ ఘనంగా అభినందిం చారు ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రటరీ సతీష్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ వినోద్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రభుదాస్, దేవిక, వార్డు సభ్యులు మానుపాటి శిరీష, గుర్రం వెంకట్ రెడ్డి, గౌరె అశోక్ రెడ్డి, ఇటికాల జాన్ రెడ్డి, చెరుకుపల్లి రాజు, మర్రి నాగరాజు, దేప జగన్ రెడ్డి, ఇటికాల శేఖర్ రెడ్డి, డాక్టర్ శీను, కట్ట రంజిత్ రెడ్డి, ఉప్పు బంగారు, సిహెచ్ యాదయ్య, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు శ్రీనివాస్ రెడ్డి బాల్యమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిరుమర్తి రైతువేదికలో ఘనంగా విత్తన మేళా ప్రారంభం

### సన్న రకాల వరి సాగుకు ప్రభుత్వ బోనస్ మండల వ్యవసాయ అధికారి శివరాం కుమార్

### ఈ నెల 30వ తేదీ వరకు రైతువేదికల్లో ప్రత్యేక కౌంటర్లు



**మాడుగులపల్లి, జూన్ 23( జనం సాక్షి ):** మాడుగులపల్లి మండలంలోని చిరుమర్తి రైతువేదిక నందు మంగళవారం నాడు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక 'విత్తన మేళా' (సీడ్ మేళా) కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి యం. శివరాం కుమార్ మాట్లాడుతూ మండలంలో ఈ నెల 23 నుండి 30వ తేదీ వరకు వారం రోజుల పాటు విత్తన మేళా నిర్వహించబడుతుందని తెలిపారు రైతుల సౌకర్యార్థం మండలంలోని అన్ని రైతు వేదికలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా, ప్రభుత్వ సూచనల మేరకు రైతులు సన్న రకాల వరి సాగుపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ముఖ్యంగా బీపీటీ -5204, జై శ్రీరామ, కేఎన్ఎం -1638, కేఎన్ఎం -7715, ఆర్ ఎన్ ఆర్ -15048, హెచ్ఎంటి సోనా, విజిఎల్ -44 వంటి సన్న రకాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తోందని, ఈ అవకాశాన్ని మాడుగులపల్లి మండల రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను తగ్గించుకునేందుకు రైతులు సాంప్రదాయ యూరియా, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, నానో యూరియా మరియు నానో డి.ఏ.పి (నానో డి ఏ పి) వాడాలని పిలుపునిచ్చారు భూసారాన్ని రక్షించుకోవడానికి రసాయనిక మందుల వాడకం తగ్గించి, సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూరెళ్ల నాగమణి వెంకటాచారి, వ్యవసాయ విస్తరణ అధికారి వి. పార్వతి, స్థానిక విత్తన డీలర్లు మండల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

## రైతు వేదికలలో రైతులకు అందుబాటులో విత్తనాలు

### వ్యవసాయ సహాయ సంచాలకులు, రమేష్ బాబు



**తుంగతుర్తి జూన్ 23 (జనం సాక్షి)**

మండల పరిధిలోని కొత్తగూడెం గొట్టిపర్తి రైతు వేదికలో మండలంలోని విత్తన డీలర్లు తమ వద్ద ఉన్న విత్తనాలను అందుబాటులో ఉంచుతారని రైతులు రైతు వేదికల ద్వారా విత్తనాలను కొనుగోలు చేయాలని తుంగతుర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ బాబు అన్నారు, మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెం రైతు వేదికలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తనమేల కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు, రైతులు నేటి నుండి ఈనెల 30వ తేదీ వరకు విత్తనమేల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఈ విత్తన మేళాలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 7 రకాల వరి సన్న బియ్యం రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు, అందులో బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048 జైశ్రీరామ్, హెచ్ఎంటి సోనా డబ్ల్యూ జి ఎల్ 792 మరియు డబ్ల్యూ జి ఎల్ 44 (సిద్ధి) కే ఎన్ ఎం1638 రకాలకు మాత్రమే బోనస్ వర్తిస్తుందని తెలియజేశారు కావున రైతులు పై తెలియజేసిన సన్న రకాలను వేసుకున్నట్లయితే మంచి దిగుబడితో పాటు ప్రభుత్వం వారి ఉద్దేశించిన బోనస్ కూడా వస్తుందని తెలియజేశారు ఈ సందర్భంగా కొత్తగూడెం రైతు వేదికలో రేపటి నుంచి కొత్తగూడెం మరియు గొట్టిపర్తి రైతు వేదికలలో మండలంలోని విత్తన డీలర్లు తమ వద్ద ఉన్న విత్తనాలను అందుబాటులో ఉంచుతారని రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని రైతు వేదికల ద్వారా విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని కోరారు ప్రస్తుతం రాష్ట్రం మీద ఎల్ నినో ప్రభావం ఉన్నందున వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది,కాబట్టి జొన్నలు సజ్జలు రాగులు, కందులు వంటి పంటలను వేసుకోవడం ద్వారా రైతులు నష్టాన్ని నివారించుకొని ఈ సీజన్ నుంచి మంచి ఆదాయంతో బయటపడాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. దొడ్డు రకాలు సాగు చేయటం వల్ల ఉపయోగం ఉండకపోవచ్చని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సర్పంచ్ మండల వ్యవసాయ అధికారి శ్రీ ఆర్ దేవ ప్రసాద్ ఏ ఈ ఓ లు పి జోష్న, జె, శ్వేత మరియు పంచాయతీ సెక్రెటరీ గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలి

### వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి

**చింతపల్లి, జూన్ 23(జనంసాక్షి)**

ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు అమ్మితే లైసెన్సు రద్దుతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చింతపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. షాపుల్లో ధరల పట్టికను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ఉంచాలని, అన్ని అమ్మకాలు ఈ-పాస్ విధానం ద్వారానే నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గొడుకొండ్ల క్లస్టర్ పరిధిలోని మదనాపూర్ గ్రామ రైతు వేదికలో నిర్వహించిన "రైతువేదికలలో విత్తన మేళా" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు రకాల సన్న రకం వరి విత్తనాలను స్థానిక డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాల నేపథ్యంలో రైతులు కంది, జొన్న వంటి అరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ 23 నుంచి 30 వరకు ప్రత్యేక విత్తన మేళా (సీడ్ మేళా) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం బోనస్ అందిస్తున్న కేఎన్ఎం-1638, కేఎన్ఎమ్ -7715, ఆర్ ఎన్ ఎం -15048, హెచ్ఎంటి సోనా, రకాల సన్న వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రకాల వరి సాగు చేసే రైతులకు ప్రత్యేక బోనస్ లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయాలని వ్యవసాయ శాఖ కోరింది.ఈ కార్యక్రమంలో మదనాపూర్ సర్పంచ్ జంగిటి విజయలక్ష్మి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి కవిత, గొడుకొండ్ల క్లస్టర్ రైతులు, వివిధ విత్తన డీలర్లు పాల్గొన్నారు..

## రోడ్డు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు



**చింతపల్లి, జూన్ 23(జనంసాక్షి)**

ప్రజల్లో చట్టాల పట్ల అవగాహన పెంపొందించి నేరాల నివారణకు తోడ్పడే లక్ష్యంతో చింతపల్లి పోలీసులు సోమవారం మాల్‌లో 'మిషన్ త్రిబుల్ ఆర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ముత్యాల రామ్మూర్తి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల మోసాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భాగంగా రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, కుటుంబాలు మరియు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంటూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. యువత మంచి అలవాట్లు అలవరచుకుని సమాజాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య, గ్రామ సెక్రెటరీ మురళి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలకు వెంపటి పాఠశాల విద్యార్థుల ఎంపిక

**తుంగతుర్తి జూన్ 23 (జనం సాక్షి)**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంపటి నుండి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినలుగురు విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్ అన్నారు, మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన పుల్లూరు శివకేశ వ ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు, కరీంనగర్ క్రీడా పాఠశాలకుమాచర్ల సహస్ర క్యాస్ట్రో, వరంగల్ క్రీడా పాఠశాలకు మడి పెద్ది వివేక్, రామనబోయిన ఈష ఎంపిక కావడం జరిగిందన్నారు తమ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం, విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశం ఉందని అన్నారు, ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, విద్యార్థులను అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, నిమ్మరబోయిన నవీన, బందారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రం, మాలోత్ కృష్ణ, గుండ్ల ఆంజనేయులు, ప్రీ ప్రైమరీ టీచర్ రామనబోయిన మౌనిక, ఆయా అబ్బ గాని మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# త్రివేణి లో 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## 33 సంవత్సరాల విశ్వాసం -33 ఏళ్ల విద్యాప్రస్థానం

**ఖమ్మం, (జనంసాక్షి) :** విద్యారంగంలో నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తూ, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రముఖ విద్యాసంస్థ త్రివేణిస్కూల్×విజయవంతంగా 32 సంవత్సరాలు పూర్తి చేసుకుని సగర్వంగా 33వ సంవత్సరం లోనికి అడుగిడింది. ఈ 33 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకొని 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఖమ్మం పాఠశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనీ లో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ కేవలం ఒక చిన్న మొక్కగా ప్రారంభమై త్రివేణి నేడు వేలాది మంది విద్యార్థులకు నీడనిచ్చే మహా వృక్షం గా మారడం చాలా గర్వంగా ఉందని, గడచిన 32 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని, కేవలం ర్యాంకుల కోసమే కాకుండా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రయాణించామని తెలియజేశారు. మా ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన తల్లిదండ్రులకి, అంకిత భావంతో పనిచేసిన ఉపాధ్యాయ బృందానికి, సిబ్బందికి, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గడచిన 32 ఏళ్లుగా పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకులతో జిల్లా రాష్ట్రస్థాయిలో మేటిగా నిలబడ్డామని, కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్స్ ద్వారా పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తామని, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ క్లాస్ లు, అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక ల్యాబ్ లను విద్యార్థులకు అందిస్తున్నామని తెలియజేశారు. ఈ సమావేశం సందర్భంగా పిల్లలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 33వ సంవత్సర లోగో ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీ ఓ అడ్మిన్ అప్పారావు,పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# విత్తన మేళా నిర్వహణ.. అందుబాటులో

## నాలుగు రకాల వరి విత్తనాలు

**చంద్రుగొండ, జూన్ 23 (జనంసాక్షి):**

మండల పరిధిలోని అయ్యన్నపాలెం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విత్తన మేళా నిర్వహించి రైతులకు వివిధ రకాల వరి విత్తనాలను ప్రదర్శించారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల వరి విత్తనాలను సాగు చేసే రైతులకు బోనస్ అర్హత లభిస్తుందని అధికారులు తెలియజేయడంతో రైతులు విత్తనాల కొనుగోలుపై ఆసక్తి కనబరిచారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి (ఏవో) వినయ్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతు వేదికలో నాలుగు రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిలో బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1548, కేఎన్ఎమ్-7715, కేఎన్ఎమ్-1638 రకాల విత్తనాలు రైతులకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా కందులు, వివిధ కూరగాయల విత్తనాలు కూడా రైతు వేదికలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ సూచనల మేరకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్, విత్తనాల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి రైతువేదికలో ఘనంగా విత్తన మేళా ప్రారంభం

**❍ సన్న వరి రకాల సాగుకు ప్రోత్సాహం.. ❍ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు సూచనలు**

**హాలియా, జూన్ 23 జనం సాక్షి:**

అనుముల మండలంలోని కొత్తపల్లి రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ 23 నుండి జూన్ 30 వరకు నిర్వహించనున్న విత్తన మేళాను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కలసాని చంద్రశేఖర్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ అలుగుల బ్రహ్మారెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు సరిత, మండల వ్యవసాయ అధికారి వెంకన్న తదితరులు పాల్గొని విత్తన మేళాను ప్రారంభించారు.ఈ సందర్భంగా వరి, కంది తదితర వివిధ పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మండల పరిధిలోని రైతులు విత్తన మేళాను సందర్శించి తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన విత్తనాలను ఎంపిక చేసుకొని సాగు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన బీపీటీ-5204, కేఎన్ఎం?118, ఆర్ఎన్ఆర్లి-



15048, డబ్ల్యూజీఎల్-44, హెచ్ఎంటీ, జై శ్రీరామ్ తదితర సన్న వరి రకాలను మాత్రమే సాగు చేస్తే క్వింటాకు రూ.500 ప్రోత్సాహక నగదు లభిస్తుందని తెలిపారు.ప్రస్తుతం ఎల్నినో ప్రభావంతో ఈ వానాకాలంలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా పత్తి, పప్పుధాన్యాలు, అపరాల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేరేడుచర్లలో మహిళపై కత్తితో దాడి

**నేరేడుచర్ల (జనంసాక్షి ):**

మహిళ పై కత్తితో దాడి చేసిన సంఘటన మున్సిపల్ ఆఫీస్ పక్క బజార్ లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టానికి చెందిన తాళ్ల కాశమ్మ (55), భర్త కోటేశ్వరరావు, కొంతకాలంగా నేరేడుచర్లకు చెందిన షేక్ సుభాన్‌తో పరిచయం ఏర్పడటంతో వారిద్దరూ కలిసి మిర్యాలగూడలో అద్దె గదిలో నివసిస్తున్నారు. అయితే కాశమ్మ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గత రెండు నెలలుగా సుభాన్‌ను విడిచి నేరేడుచర్లలో తన దత్తత కుమారుడితో కలిసి తన ఇంటిలో ఉంటోంది.కాశమ్మ తన వద్దకు తిరిగి రాకపోవడంతో ఆగ్రహానికి గురైన షేక్ సుభాన్, మంగళ వారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో కాశమ్మ ఇంటికి వెళ్లాడు.ఆ సమయంలో కాశమ్మ ఇంట్లో పడుకుని ఉండగా, కూరగాయలు కోసే కత్తితో ఆమె కడుపు భాగంలో మూడు సార్లు పొడిచినట్లు సమాచారం. ఈ ఘటనలో కాశమ్మకు తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం జరిగింది. గాయపడిన కాశమ్మను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల చికిత్స అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో డిశ్చార్జ్ చేశారు.ఈ ఘటనపై నేరేడుచర్ల ఎస్ఐ సైదిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విత్తన మేళాలో నాణ్యమైన విత్తనాలపై రైతులకు అవగాహన



**ఎర్రుపాలెం, జూన్ 23 (జనంసాక్షి):**

మండలంలోని ఎర్రుపాలెం, మీనవోలు, జమలాపురం, ఇనగాలి, బుచ్చిరెడ్డిపాళెం రైతువేదికలో మంగళవారం విత్తన మేళా నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, కొత్త రకాలు, ప్రభుత్వం బోనస్ కోసం ఎంపిక చేసిన 7 సన్న రకాలపై ఎల్నినో ప్రభావం వల్ల పంట మార్పిడి(అపరాల సాగు) వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని మీమవోలు రైతువేదికలో ంఓఅ చైర్మన్ బండారు నరసింహారావు ముఖ్య అతిధిగా పాల్గొని అన్నారు. విత్తన మేళాను ప్రారంభించి మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్ కోసం ధృవీకరించిన 7 సన్న రకాల విత్తనాల వినియోగించుకొని బోనస్ పొందాలని సూచించారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఏవో బోయినపల్లి సాయి శివ, మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు సరిగ్గా కురిసే అవకాశం లేనందున రైతులు పత్తి, వరి బదులుగా అపారల సాగు వైపు మొగ్గుచూపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు నాగిరెడ్డి, సర్పంచులు నంద్రు అశ్విని, తుల్లూరి నిర్మల కుమారి, వేమిరెడ్డి పరమేశ్వరి, లాలయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ షేక్ ఇస్మాయిల్, ఉప సర్పంచ్ ముక్కర సందీప్ రెడ్డి, మీమవోలు పాక్స్ చైర్మన్ మధుసూదన్,ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# వేపల సింగారం మిట్టగూడెం లలో బొడ్రాయి, గ్రామ దేవతల ప్రతిష్ట

**హుజూర్ నగర్ రూరల్, జూన్ 23 (జనంసాక్షి):**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండల పరిధిలోగల వేపల సింగారం మిట్టగూడెం లలో ఈనెల 25న గ్రామ ప్రజల సహాయ సహకారాలతో బొడ్రాయి ప్రతిష్ట తో పాటు గ్రామ దేవతలు శ్రీ మహాకాళి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహా సరస్వతి స్వరూపిణి, శీతలదుర్గా పరమేశ్వరి, నాభిశిల (బొడ్రాయి) ముత్యాల పరమేశ్వరి, పెద్దమ్మ తల్లి, మద్దిరావమ్మా , అంకమ్మ తల్లి, కట్ట మైసమ్మ , పోతురాజు, విమాన శిఖర దత్తాత్రేయ, జంట నాగేంద్రులు , శ్రీ వేంకటేశ్వర స్వామి జీవద్వజ ప్రతిష్ట బ్ర॥ శ్రీ॥వే॥ బ్రాహ్మణోత్తములచే నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ, గ్రామ ప్రజలు,భక్తులు తెలియజేశారు. (బుధవారం) నేటి నుండి ఉదయం 6 గంటలకు సుప్రభాతం, 8 గంటలకు మంగళ వాయిద్యములు, 8:30 ని॥ లకు వేదమంత్ర పఠనము, 9:30 ని॥లకు విఘ్నేశ్వర పూజ, కర్మణ: పుణ్యాహావాచనం అను కార్యక్రమాలు క్షీరాధివాసము, లక్షణోద్ధారణ, పంచగవ్యాధివాసం, నవకలశ స్థాపన, అగ్నిమదనం, అగ్ని ప్రతిష్టాపన, ఆవాహిత సర్వదేవతా హోమాలు, మధ్యాహ్నం 12 గంటలకు మంగళ నీరాజనం మంత్రపుష్పములు అనంతరం తీర్థప్రసాద వినియోగం సాయంత్రం 4 గంటలకు గ్రామ వీధుల్లో విగ్రహాల ఊరేగింపు, రకరకాల వేషధారణలు, బాణా సంచాలతో అంగరంగ వైభవంగా, కనుల పండగగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25 (గురువారం) న ఉదయం 5 గంటలకు సుప్రభాతం 6 గంటలకు మంగళ వాయిద్యములు,6:30 ని॥ లకు వేదమంత్ర పఠనం 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, కర్మణ: పుణ్యా హావాచనం, గర్తన్యాసం, ధాతునాస్యం, బీజన్యాసం, రత్న న్యాసం, 7:47 ని॥ లకు యంత్ర ప్రతిష్టాపనలు, విగ్రహ ప్రతిష్టాపనలు, 9 గంటలకు చండీ మహాయాగం ఆరంభం 10 గంటలకు షోడశ కళాన్యాసములు, నేత్రోన్మీలనం, ప్రాణ ప్రతిష్టాపన, దృష్టి కుంభం, ధేను దర్శనం, మూర్తి దర్శనము, మధ్యాహ్నం 2: 30 ని ॥ లకు మహా పూర్ణాహుతి, యగ్నేశ్వర పూజ, అష్టదిక్షు బలి ప్రధానం, దంపతీ పూజ, సువాసినీ పూజ, వటుక పూజ, కలశోద్వాసన, అవబృధం,ఆశీర్వచనం, పండిత సత్కారం, యజ్ఞప్రసాదాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పురోహితుల, కొంకపాక రాధాకృష్ణమూర్తి, శ్రీ మాతా చారిటబుల్ ట్రస్ట్, తదితరులు పాల్గొంటున్నట్లు తెలియజేశారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

## మధిర రూరల్ ఎస్సై విశ్వతేజ్

**మధిర, జూన్ 23 (జనంసాక్షి):**

నేటి సమాజంలోని యువత, విద్యార్థులు డ్రగ్స్ మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మధిర రూరల్ ఎస్సై విశ్వతేజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో సర్పంచ్ సిద్దిపోగు ప్రసాద్ ఆధ్వర్యంలో వంగవీడు ప్రభుత్వ స్కూళు ్ల నందు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మధిర రూరల్ ఎస్సై విశ్వతేజ పాల్గొని ప్రసంగించారు. యువత డ్రగ్స్ రాకెట్ మత్తుకు అలవాటు పడకుండా మంచిగా చదువుకోవాలి మంచి ప్రయోజకులు కావాలని ఎవరైనా డ్రగ్స్ గ్రామంలోకి వచ్చినట్లు సమాచారం వస్తే స్థానిక పోలీసులకు గాని పోలీస్ స్టేషన్ కి గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని , డ్రగ్స్ అలవాటు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ వైస్ చైర్మన్ అయిలూరి సత్యనారాయణ రెడ్డి పోలిస్ స్టేషన్ సిబ్బంది కోట దర్మగారు పంచాయతీ కార్యదర్శి గారు రమేష్ గారు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ సమస్యలపై మాస్ లైన్ ధర్నా




**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 23( జనంసాక్షి )**
ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ లో ఖాళీగా ఉన్న 60 డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలని అదనంగా 150 నర్సులను కేటాయించాలని ల్యాబ్ ఫార్మసీ సౌకర్యాలు మెరుగుపరచాలని తదితర డిమాండ్లతో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పటల్ సర్వే నిర్వహించి మంగళవారం నాడు సర్వేలో దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాలో ప్రభుత్వ హాస్పటల్ మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు.అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకి తలమానికంగా ఉన్న ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ ని అధికారులు మంత్రులు పట్టించుకోకపోవడం కారణంగా రోజురోజుకీ కూనరేల్లుతుంది ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విభాగాలలో 60 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని తక్షణమే నింపాలని ఆయన కోరారు సీనియర్ నర్సులు లేకపోవడం కారణంగా జూనియర్లోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని దీంతో రోగులకు మెరుగైన హెల్త్ కేర్ అందటం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే 150 అదనంగా నర్స్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా టీ హబ్ పేరిట వందలాది ల్యాబ్ టెస్టులను చేస్తామని గొప్పగా చెప్పుకున్న ల్యాబ్లో అన్ని యంత్రాలు చెడిపోయి ఉన్నాయని అవి సరిగా పనిచేయకపోవడం కారణంగా సరైన టెస్టులు రావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మసిస్టులు తగినంత మంది లేకపోవడం కారణంగా 24 గంటల మెడికల్ షాప్ అందుబాటులో లేదని ఆయన అన్నారు ఇక్కడ లేని డిపార్ట్మెంట్లను కూడా ఏర్పాటు చేయాలని ఎమర్జెన్సీ హెల్త్ కేర్ కోసం ఐసిఈ బెడ్ల సంఖ్య పెంచాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమస్యలు పరిష్కారానికి జిల్లా అధికారులు ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు వైద్యాన్ని ఎలాగూ నియంత్రించలేరు ప్రభుత్వ వైద్యాన్ని అయినా పేదలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శిరోమణి మాట్లాడుతూ తక్షణమే మాతా శిశు కేంద్రం అదనపు డాక్టర్ను కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు ఈ కార్యక్రమానికి డివిజన కార్యదర్శి ఝాన్సీ అధ్యక్ష వహించగా నాయకులు కే శ్రీను శోభ రాకేష్ సత్తార్ లెనిన్ లక్ష్మణ్ నరసింహారావు కొమరయ్య ధరావత్ లక్ష్మణ్ ప్రేమ్ సింగ్ జాస్మిన్ సుజాత రామారావు రామనాథం వెంకన్న దేవల తదితరులు పాల్గొన్నారు.

# ఘోర వైఫల్యం చెందిన బిజెపి ప్రభుత్వం

## నాగండ్ల దీపక్ చౌదరి



**ఖమ్మం కార్పొరేషన్,జూన్ 23 ( జనంసాక్షి)**
ఇప్పుడు మన భారతదేశాన్ని ప్రధానంగా పట్టిపీడిస్తున్న సమస్య నిరుద్యోగం గత 12 సంవత్సరాలుగా దేశంలో ఉద్యోగ నియామకాలలో జరుగుతున్న జాప్యం వల్ల యువత నిర్వీర్యమైపోయింది.ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పరీక్షా విధానం మన భారతదేశంలో ఐఐటి, నీట్ రూపంలో రూపొందించబడింది. ఈ పరీక్ష విధానం విద్యార్థుల మస్తిష్కాలను పూర్తిగా దెబ్బతీస్తుందని ఆరోపిస్తున్నప్పటికీ మన భారతదేశం ఈ పరీక్షా విధానాలను ఇప్పటివరకు విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నది. ప్లస్ టు తర్వాత నిర్వహించే ఈ ఎంట్రన్స్ టెస్టుల కొరకు కొన్ని రాష్ట్రాలు ప్రాథమిక విద్య నుండే వీటిపై ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచి వీటిలో ఉత్తీర్ణత సాధించుట కొరకు అత్యంత కఠోరమైన పరీక్షలను ప్రాథమిక విద్యను ఇచ్చే అనేక విద్యకు సంస్థలు నిర్వహిస్తూ వస్తున్నవి ఎన్ని రోజులు కష్టపడి చదువుకొని పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈ పేపర్ లీకేజీ వల్ల మానసిక సంఘర్షణకు లోనై జీవితం మీదనే వ్యక్తి కలిగించే నైరాశ్యాన్ని విఇప్పుడున్న విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకురావడం వల్ల విద్యార్థుల లో నైపుణ్యత నశిస్తున్నది.. నాణ్యమైన విద్యాబోధన లేకపోవడం అదే సమయంలో ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ నియామకాలలో కఠిన తరమైన పరీక్ష విధానాన్ని అవలంబించడం వలన విద్యార్థులు వారి గమ్యాన్ని చేరుకోలేకపోతున్నారు. కాబట్టి గడిచిన 12 సంవత్సరాల పాటు పాలిస్తూ వస్తున్న ఈ ప్రభుత్వం విద్య ఉద్యోగం ఉపాధి కల్పన లో పూర్తిగా విఫలమైనందున ఎక్కడికక్కడ ఈ ప్రభుత్వ విధానాలను ఎండ పెట్టాల్సిన అవసరం ఉన్నదని ఈ సందర్భంగా యువతకు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, పైడిపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్, నరాల నరేష్ మోహన్ నాయుడు, డీసీసీ అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పాలకుర్తి నాగేశ్వరరావు, కోసూరి ప్రసాద్ అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాసరావు కార్యదర్శి కోనేటి నారాయణ,సంపటం నరసింహారావు యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కుక్కల మహేష్, పేరం యశ్వంత్ వసీం తోళ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు



## హరీష్ రావు పర్యటనకు చంద్రుగొండ మండలం నుంచి భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

**చంద్రుగొండ, జూన్ 23 (జనం సాక్షి):**
అశ్వారావుపేటలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి టి హరీష్ రావు పర్యటన నేపథ్యంలో చంద్రుగొండ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పెద్ద సంఖ్యలో అశ్వారావుపేటకు తరలివెళ్లారు. పార్టీ అధినేతల పిలుపు మేరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వాహనాల ద్వారా బయలుదేరి పర్యటన కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి బీఆర్ఎస్ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ గులాబీ కండువాలు ధరించి కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరలి వెళ్లిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధారా వెంకటేశ్వరరావు నరుకుల్ల సత్యనారాయణ నల్లమోతు వెంకటనారాయణ సుర వెంకటేశ్వర్లు భూపతి రమేష్ సత్తి నాగేశ్వరరావు అంజన్ రావు వాసు హనుమంతరావు రన్యా ఉగ్గం నాగరాజు తదితరులు ఉన్నారు.




## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేయాలి సర్పంచ్ లు విజయ, వినోద్

**ములకలపల్లి: జూన్ 24 జనంసాక్షి:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమాన్ని జగన్నాథపురం రైతు వేదిక లో సర్పంచ్ కుంజా వినోద్ ప్రారంభించగా, విత్తన స్టాల్స్ ను రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు, రైతులు సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలను వాడాలని, పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగే విధంగా వ్యవసాయ అధికారులు రైతులను చైతన్య పరచాలని అన్నారు. కార్యక్రమంలో జగన్నాథపురం ఉప సర్పంచ్ జలగం మాధవి, ఏ డి ఏ రవికుమార్, ఏవో అరుణ్ బాబు, ఎఇఓలు రమేష్, రాహుల్ క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

## రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ

**మధిర, జూన్ 23 (జనంసాక్షి):**
రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమం దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో మంగళవారం



ఘనంగా ప్రారంభమైంది.సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కోట వెంకటకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత సాగు సీజన్ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులకు అవసరమైన ఏడు రకాల ముఖ్యమైన విత్తనాలను సొసైటీ ద్వారా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.మార్కెట్లో నకిలీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా, ప్రభుత్వం అందించే ధృవీకరించిన విత్తనాలను మాత్రమే రైతులు వాడాలని ఆయన సూచించారు.ప్రస్తుత సీజన్కు అనువైన ఏడు రకాల నాణ్యమైన విత్తనాలు సొసైటీలో సిద్ధంగా ఉన్నాయి.ఇవి ప్రభుత్వ ల్యాబ్లలో పరీక్షించబడిన విత్తనాలు కావడం వల్ల మొలక శాతం బాగుంటుంది,తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడిని ఇస్తాయి అని తెలిపారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ విత్తనాలను సరఫరా చేస్తోంది కనుక దెందుకూరు పరిధిలోని రైతులందరూ సొసైటీ కార్యాలయాన్ని సంప్రదించి,తమకు కావలసిన విత్తనాలను సకాలంలో పొంది,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.రైతులు సకాలంలో విత్తడం ద్వారానే ఆశించిన లాభాలు సాధించగలరు అని వెంకటకృష్ణ సూచించారు.ఈ కార్యక్రమంలో దెందుకూరు సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు,సొసైటీ పాలకవర్గ సభ్యులు, సీఈఓ,వ్యవసాయ అధికారులు,స్థానిక రైతులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్ కాలనీలో చేతి పంపు ఏర్పాటు చేయాలి..

## గ్రామ యువత డిమాండ్

చంద్రుగొండ, జూన్ 23(జనం సాక్షి):
చంద్రుగొండ మండలంలోని అంబేద్కర్ నగర్ కాలనీ రెండవ లైన్లో భగీరథ, మోటార్ నీటి సరఫరా నిలిచిపోయిన సమయంలో సమీపంలో చేతి పంపు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ యువత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గతంలో గ్రామ కార్యదర్శి, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందన లేదన్నారు. కాలనీలోని సమస్యలపై పంచాయతీ గుమస్తాకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వెంటనే చేతి పంపు బోరు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో అంబేద్కర్ నగర్ ప్రజలతో కలిసి పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తంబళ్ల మంగయ్య, రాయి రాజా, నందునూరి క్రాంతికుమార్, మద్దెల క్రాంతికుమార్, బి. బన్ను తదితరులు పాల్గొన్నారు.





## టీజీఆర్ఎస్‌డబ్ల్యూ పాఠశాలలో న్యాయ అవగాహన,మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమం

**దమ్మపేట జూన్ 23 (జనం సాక్షి):** దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లి టీజీఆర్ఎస్‌డబ్ల్యూ పాఠశాలలో మండల న్యాయ సేవల కమిటీ చైర్మన్ బొమ్మతి భవాని ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ, విద్యార్థులకు ప్రేరణ, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ,దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్,కార్యదర్శి లక్కినేని, న్యాయవాదులు గొల్ల భవాని కృష్ణ యాదవ్, సంధ్యారాణి,ఉదయ్ నల్లపు, అరుణ, దమ్మపేట ఎస్ఐ అలాగే కోర్టు సిబ్బంది రాజ్‌కుమార్,కోర్టు పోలీసు సిబ్బంది ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొమ్మతి భవాని మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుకొని సమాజానికి ఆదర్శప్రాయులుగా ఎదగాలని సూచించారు. అశ్వారావుపేట సీఐ మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, విద్యార్థులకు న్యాయ అవగాహన,మంచి అలవాట్లు భవిష్యత్తు లక్ష్యాలపై పలు సూచనలు చేశారు.



## కల్లూరు రైతు వేదికలో విత్తన మేళ

**కల్లూరు జూన్ 23(జనంసాక్షి)**

ఖరీఫ్ సీజన్లో వ్యవసాయానికి సంబంధించి నాణ్యమైన విత్తనాలు ఎంపిక, పంటల సాగులో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కల్లూరు రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు మంగళవారం రైతు మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ మాదాభత్తుల రూప, మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ 23 నుండి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని ప్రతి రైతు వేదికలో విత్తన మేళాలు నిర్వహించబడుతున్నాయి అని తెలిపారు మండల రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం , విత్తన మేళాలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలు, వాటిని గుర్తించే విధానం, సాగుకు అనువైన సన్న వడ్ల రకాలు, అదేవిధంగా నానో యూరియా నానో డి.ఏ.పీ. వినియోగం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.విత్తన మేళాలో సన్న వడ్ల విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలు, నానో యూరియా నానో డి.ఏ.పీ. రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలనువిని యోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూఅర్జున్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చంద్ర రావు, భాగం ప్రభాకర్, టౌన్ అధ్యక్షులు ఉస్మాన్, పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు రైతులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వేతన జీవోను తక్షణమే అమలుచేయాలి

## - ఐటీసీ కి కనీస వేతనమండలి సభ్యుడు వినతి

**బూర్గంపహాడ్ జూన్ 23 (జనంసాక్షి)**



నూతన వేతన జీవోను తక్షణమే ఐటీసీ కర్మాగారంలో అమలుచేయాలని రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడు, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మంగళవారం ఐటీసీ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన నూతన వేతనాల ప్రకారం కార్మికులకు అందాల్సిన వేతనాలు ఐటీసీ కర్మాగారంలో ఈ జీవో ప్రకారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కోడ్ ఆన్ వేజేస్ 2019, షెడ్యూల్-1, ఎంప్లాయిమెంట్లో పేర్కొన్న నూతన కనీస వేతన రేట్లు 1.06.2026 నుంచి అమలులోకి వచ్చాయని, పాత వేతన నోటిఫికేషన్లు రద్దుకావడంతో ప్రభుత్వం కల్పించిన కొత్త వేతన సౌకర్యాన్ని ఐటీసీ పీఎస్పీడీ భద్రాచలం యూనిట్లో బదిలీ, కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే వర్తింపచేయాలని, అంతేకాకుండా కార్మికుల శ్రమకు తగిన న్యాయమైన వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఐటీసీ విభాగం అధ్యక్షులు గోనె రామారావు, కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



## అశ్వరావుపేటలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

అశ్వరావుపేట జూన్23(జనంసాక్షి):

అశ్వారావుపేట పోలీసుల ఆధ్యర్యంలో యాంటీ డ్రగ్ ఎవర్నెస్ ప్రోగ్రామ్ విజయవంతంగా నిర్వహించారు.అశ్వారావుపేట ఎస్సై మరియు సిబ్బంది కలిసి రింగ్ రోడ్డు సెంటర్ లో యువత కు విద్యార్థులకు డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై యాయతి రాజు మాట్లాడుతూ డ్రగ్ అబ్యూస్,ఇల్లిసిట్ ట్రాఫికింగ్ వల్ల కలిగే అనర్థాలనవిద్యార్థులకు వివరించారు.డ్రగ్స్ కు సంబంధించిన సమాచారంఇవ్వడావనికి 1908 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.మీరు ఇచ్చే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని.

**డ్రగ్స్ వద్దు... జీవితం ముద్దు**

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములవుదామని అన్నారు.ఈ అవగాహన సదస్సు కార్యక్రమం లో విద్యార్థులు యువకులు పాల్గొని మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

## ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 23( జనం సాక్షి )**




ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న “తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం” పోస్టర్‌ను తెలంగాణ ఉద్యమ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడమర్తి రవి, డాక్టర్ కె.వి. కృష్ణారావు, నందిగామ రాజ్ కుమార్ జానీ, బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారుల ప్రత్యేక కోటా, అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ మరియు వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రామానుజవరం ఇసుక క్వారీపై చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్ డిమాండ్

పినపాక, జూన్ 23 (జనం సాక్షి):

మణుగూరు మండలం రామానుజవరం ఇసుక క్వారీ నిర్వాహకులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామానుజవరం ఇసుక క్వారీకి చెందిన వందలాది లారీలు సోమవారం సాంబాయిగూడెం వద్ద మణుగూరు? ఏటూరునాగారం ప్రధాన రహదారిపై నిలిచిపోవడంతో సుమారు రెండు గంటల పాటు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని తెలిపారు. దీంతో ప్రయాణికులు, అత్యవసర సేవలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని అన్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా పినపాక మండలం పోట్లపల్లి పంచాయతీ గడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు.



ఆత్మహత్యాయత్నం చేసిన అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో సమయానికి వైద్యం అందక మృతి చెందినట్లు పేర్కొన్నారు. అలాగే ఇటీవల జరిగిన నీట్ పరీక్షకు హాజరుకావాల్సిన ఓ విద్యార్థిని కూడా ఇసుక లారీల వల్ల ఏర్పడిన ట్రాఫిక్ కారణంగా పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకోలేకపోయిందని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రవాణా శాఖలు ప్రధాన రహదారులపై ఇసుక లారీలు నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుమ్మడి గాంధీ, దాట్ల వాసుబాబు, పొనుగోటి భద్రయ్య, రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, బత్తుల వెంకటరెడ్డి, చెన్నకేశవులు, షేక్ జాంగీర్, బూర రమేష్, పడిగె అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు తప్పని తంటాలు

**- విస్టా కాంప్లెక్స, చాకలి బజార్ వీదుల పారిశుధ్యం అస్తవ్యస్తం**

**- ఒకటో వార్డు పై దృష్టి సారించండి**

**భద్రాచలం జూన్ 23 (జనంసాక్షి)**

భద్రా?ద్రి కొత్తగూడెం జిల్లా :- నిరంతరం భక్తుల తాకిడితో రద్దీగా ఉండే విస్తా కాంప్లెక్స్ పక్కన ఉన్న చాకలి బజార్ పారిశుధ్యానికి ఆమడ దూరంలో ఉందని స్థానికులతో పాటు భక్తులు ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. దక్షిణ అయోధ్య గా బాసిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనానికి గోదావరి స్నానాలకి వెళ్లడానికి కీలక మార్గం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆ మార్గం గుండా సంచరిస్తూ ఉంటారు. ఆ లైన్ లో ఉన్న కొన్ని లాడ్జిలు, వసతిగృహాల వ్యర్థాలను కాలువలోకి మళ్లించడంతో ఆ మార్గం గుండా వెళ్లేవారికి దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు తెలుపుతున్నారు. అంతేకాకుండా ఆ వీధి అంతా పారిశుద్వానికి ఆమడ దూరంలో దర్శనమిస్తుంది. సీసీ రోడ్డు సైతం శిధిలావస్థకు దగ్గరగా తయారయింది. గ్రామపంచాయతీ వారు ఇప్పటికైనా ఈ మార్గాన్ని స్వచ్ఛ మార్గంగా తీర్చిదిద్దాలని, కాలువతోపాటు సీసీ రోడ్డు కు మరమ్మత్తులు జరిపించాలని భక్తులు కోరుకుంటున్నారు.